క్లుప్తంగా

మంత్రి సీతక్కను కలిసిన 'నిమ్మతి'



జనగామ: పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను జనగామ పీఏసీఎస్ చైర్మన్ నిమ్మతి మహేందర్ రెడ్డి, జెడ్పీటీసీ నిమ్మతి దీపిక బుధవారం హైదరాబాద్‌లో ఆమె నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. నిమ్మతి దంపతులు సీతక్కకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు.

మంత్రి పొంగులేటిని కలిసిన వైస్ ఎంపీపీ
స్టేషన్‌ఘన్‌పూర్: ఇటీవల బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఘన్‌పూర్ వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి బుధవారం రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని హైదరాబాద్‌లో మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు.

జంగాను కలిసిన జెడ్పీటీసీ రవి
స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణ ఆయిల్ సీడ్స్ ఫెడరేషన్ చైర్మన్‌గా నియమితులైన జంగా రాఘవరెడ్డిని స్టేషన్‌ఘన్‌పూర్ జెడ్పీటీసీ మారపాక రవి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. హనుమకొండలోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. పసునూరి మహేందర్‌రెడ్డి, ఆకుల కుమార్, కంకటి రవీందర్ ఉన్నారు.

బ్రహ్మచారికి డాక్టరేట్



బచ్చన్నపేట: మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఉప్పలోజు బ్రహ్మచారికి బుధవారం డాక్టర్ ఆఫ్ లిట్రసీ గౌరవ డాక్టరేట్ లభించింది. ఈ మేరకు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో కుటుంబ సభ్యులతో కలిసి ముఖ్య అతిథులు పవన్‌కళ్యాణ్, నిర్వాహకుడు విల్సన్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. బ్రహ్మచారికి అవార్డు రావడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

దుర్గమ్మకు పూజలు



పాలకుర్తి టౌన్: మండలంలోని రాఘవపురంలో దుర్గమ్మ తల్లి బోనాల పండుగ బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీ రెడ్డి పాల్గొని దుర్గమ్మకు పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఝాన్సీరెడ్డిని సన్మానించారు. కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షులు గిరగాని కుమారస్వామి, కార్యదర్శి భైరు భార్గవ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలి



పాలకుర్తి: సామాజిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు పరీక్షలు చేసేందుకు స్కానింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు దుంపలి సంపత్ కోరారు. పాలకుర్తి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన బుధవారం సందర్శించి మాట్లాడారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆస్పత్రికి ఇతర మండలాల నుంచి కూడా గర్భిణులు వస్తారని, వారికి పరీక్షలు నిర్వహించేందుకు ప్రత్యేక డాక్టర్‌ను ఏర్పాటు చేయాలని అన్నారు. ఇక్కడ వైద్యసేవలు సరిగాలేక గర్భిణులు పట్టణాలకు వెళ్తున్నారని తెలిపారు. గర్భిణులకు మెరుగైన సేవలు అందించేందుకు స్కానింగ్ సెంటర్ ఏర్పాటు చేసి డాక్టర్లు, సిబ్బందిని నియమించాలని కోరారు. నాయకులు కమ్మగాని నగేష్ తదితరులు ఉన్నారు.

కమిటీ ఎన్నిక

నర్మెట: మండలంలోని అమ్మాపురం ఉన్నత పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. గ్రామ వీఓఏ కుంటి బాలచందర్, వీఓ ఎర్ర సుప్రియ, హెచ్‌ఎం జి.మంజులాదేవి ఆధ్వర్యంలో ఎన్నికైన కమిటీలో 6వ తరగతి నుంచి కుంటి శారద, యారకవిత, గుజరాతి పూలమ్మ, 7 నుంచి గూడెపు సువర్ణ, 8 నుంచి పండ్ల వసంత, చెక్కిళ్ల రాణి, గడ్డం ఉమ, 9 నుంచి కుంటి రజిత, గంగం రమాదేవి, బైరగోని లావణ్య, పది నుంచి ఇమ్మడి నాగమణి, బైరగోని మంజుల, చింతల లక్ష్మి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

మత్స్యశాఖ కమిటీ..
బచ్చన్నపేట: నక్కవానిగూడెం మత్స్య పారిశ్రామిక శాఖ సహకార సంఘం నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్నికల అధికారిగా కోఆపరేటివ్ డిపార్ట్‌మెంట్ సీనియర్ ఇన్‌స్పెక్టర్ స్వర్ణలత వ్యవహరించారు. సంఘం అధ్యక్షుడిగా పంబాల సిద్దులు, ఉపాధ్యక్షుడిగా గొడుగు మహేందర్, ప్రధాన కార్యదర్శిగా పంబాల మల్లేశం, డైరెక్టర్లుగా యాదగిరి, శ్రీధర్, ప్రవీణ్, నాగరాజు, ప్రశాంత్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పంబాల రాములు, నరేష్, నవీన్, గొడుగు రాములు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి



స్టేషన్‌ఘన్‌పూర్: రాజకీయ నాయకులతో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకన్న



నర్మెట: పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న జనగామ ఆర్డీఓ

స్టేషన్‌ఘన్‌పూర్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులో ఉందని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఎన్నికల నిబంధనలు పాటించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఘన్‌పూర్ ఆర్డీఓ డీఎస్ వెంకన్న అన్నారు. ఎన్నికల నియమావళిపై నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన రాజకీయ పార్టీల నాయకులకు ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉందని, అన్ని ప్రభుత్వ కార్యాలయాల భవనాలపై ఉన్న రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, రాతలు తొలగించాలని, ఎలాంటి రాజకీయ పార్టీల ప్రకటనలు వేయవద్దన్నారు. నియోజకవర్గంలో 44 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామని, ఆయా కేంద్రాల వద్ద సెంట్రల్ ఆర్మ్‌డ్ ఫోర్స్ బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ఎంసీసీ, ఫ్లయింగ్ స్క్వాడ్, సెక్టోరియల్ అధికారులు ఎన్నికల కోడ్‌ను క్షుణ్ణంగా పరిశీలన చేస్తాయని, కోడ్ ఉల్లంఘన జరిగితే తగిన చర్యలు తప్పవన్నారు. ప్రతీ ఎన్నికల నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని, తప్పనిసరిగా నిబంధనల్ని పాటించాలని ఆయన సూచించారు.

మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలి
నర్మెట/బచ్చన్నపేట: పోలింగ్ బూత్‌ల్లో మౌలిక సదుపాయాల ఏర్పాటును త్వరిత గతిన పూర్తిచేయాలని ఆర్డీఓ డి.కొమురయ్య తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని నర్మెట మండల కేంద్రంతోపాటు వెల్దండ, హన్మంతాపూర్‌లలోని ఉన్నత పాఠశాలలను బుధవారం ఆయన పరిశీలించారు. తాగునీరు, మరుగుదొడ్లు, ఫ్యాన్లు, విద్యుత్‌దీపాలు, దివ్యాంగులకోసం ర్యాంప్‌లు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆయన అధికారులకు సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ ఎం.మహిపాల్ రెడ్డి, ఆర్‌ఐ సాయిబాబా, బీఎల్‌ఓ తదితరులు ఉన్నారు. అలాగే బచ్చన్నపేట మండలంలోని పోచన్నపేట, కేసిరెడ్డిపల్లి, కొడవటూర్ ప్రభుత్వ పాఠశాలల్లోని పోలింగ్ బూత్‌లను ఆయన తహసీల్దార్ విశాలాక్షి, ఎంపీడీఓ రఘురామకృష్ణలతో కలిసి పరిశీలించారు. సిబ్బందికి బూత్‌ల్లో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని సూచించారు. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

పెంబర్తి చెక్‌పోస్ట్ వద్ద తనిఖీ



జనగామ రూరల్: కారును తనిఖీ నిర్వహిస్తున్న ఏసీపీ దామోదర్‌రెడ్డి

జనగామ రూరల్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పెంబర్తి హైవే రోడ్డులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను బుధవారం ఏసీపీ దామోదర్‌రెడ్డి, సీఐ రఘుపతిరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా, డబ్బు రవాణా జరగకుండా చూడాలని పోలీసులకు సూచించారు.

జీడికల్‌లో..
లింగాలఘణపురం: లోక్‌సభ ఎన్నికల కోడ్ నేపథ్యంలో జనగామ–యాదాద్రి భువనగిరి జిల్లాల సరిహద్దు గ్రామమైన జీడికల్‌లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద బుధవారం రాత్రి ఎస్సై చింత రాజు ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. ఎన్నికల కోడ్ దృష్ట్యా ఎవరైన ఎక్కువ డబ్బులు తీసుకెళ్లే క్రమంలో అందుకు సరైన ఆధారాలు వెంట తీసుకొని రావాలని సూచించారు.

చెక్‌పోస్టు సందర్శన
జఫర్‌గఢ్: ఎన్నికల నియమ నిబంధనలను అందరు పాటించాలని తహసీల్దార్ ఆంజనేయులు కోరారు. మండల కేంద్రమైన జఫర్‌గఢ్ శివారులో నల్లబండ క్రాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును తహసీల్దార్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ అదేశాల మేరకు ప్రత్యేకంగా చెక్‌పోస్టును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ హరిప్రసాద్, ఆర్‌ఐ అనిల్‌బాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న బృందం సభ్యులు

తరిగొప్పుల: 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరూ ఓటు వేయడానికి అర్హులే అని, ఓటు హక్కు లేకుంటే వెంటనే ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ కిష్టయ్య అన్నారు. తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఓటు హక్కుపై కళాజాతా ద్వారా అవగాహన కల్పించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఓటు ద్వారా సమర్థులైన, బాధ్యతగల పాలకులను ఎన్నుకునే హక్కు రాజ్యాంగం కల్పించిదన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మండలంలో అధిక శాతం పోలింగ్ జరిగేలా సహకరించాలని కోరారు. ఆర్‌ఐ రవీందర్, కళాజాతా బృందం సభ్యులు తిప్పర్తి శ్రీనివాస్, సాంబయ్య, బాలయ్య, బావండ్లపల్లి చిరంజీవి, సంపత్ కుమార్, విజయ పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన కల్పించండి



బచ్చన్నపేట: కొన్నెలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేస్తున్న విక్టోరియా

బచ్చన్నపేట: గ్రామీణ ప్రాంతాల్లోని గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, పిల్లలకు పోషకాహారంపై ఆయా గ్రామాల అంగన్‌వాడీలు అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ అసిస్టెంట్ సీడీపీఓ విక్టోరియా అన్నారు. బుధవారం మండలంలోని కొన్నె ప్రాథమిక పాఠశాలలోని అంగన్‌వాడీ కేంద్రంలో మండల స్థాయి పోషణ పక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పౌష్టికాహార పదార్థాలు, కూరగాయాలపై ప్రదర్శన ఏర్పాటు చేశారు. విక్టోరియా మాట్లాడుతూ మహిళలు రక్తహీనత నివారణకు చిరుధాన్యాలను తీసుకోవాలన్నారు. అనంతరం చిన్నారులకు అక్షరాభ్యా సం నిర్వహించారు. అదే విధంగా మండలంలోని గోపాల్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ రఘురామకృష్ణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మనో హర, కవిత, డాక్టర్ మమత, పంచాయతీ కార్యదర్శి ఉపేందర్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం
జఫర్‌గఢ్: పోషకాహారం తీసుకోవడంతో పిల్లలు, తల్లులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీఓ సుమన్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ టి.అనిత అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని రేగడితండా శివారు కేజీతండా, హిమ్మత్‌నగర్ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్షం వారోత్సవాలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతాలు, అవగాహన ర్యాలీలు నిర్వహించారు. వీనారాణి, విజయ, రజిని, రాజమణి, ఆయాలు పాల్గొన్నారు.

కొడకండ్ల: పోషకాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరళ సూచించారు. పాకాల అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ్ పక్వాడ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శి కోట బయ్యన్న, అంగన్‌వాడీ టీచర్లు శ్రీలత, సుకన్య పాల్గొన్నారు.

రఘునాథపల్లి: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఎంపీడీఓ గార్లపాటి శ్రీనివాసులు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు సరస్వతి, లావణ్యలు, అంగన్‌వాడీ టీచర్లు కవిత, రేణుక పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

జఫర్‌గఢ్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని ఆ పార్టీ జిల్లా నాయకులు కట్టా మనోజ్‌రెడ్డి, అన్నెబోయిన భిక్షపతి, మంచాల ఎల్లయ్య అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ఎంపీటీసీ చిలువేరు శివయ్య, మాజీ సర్పంచ్ తాటికాయల బాబుతో పాటు వివిధ పార్టీల నుంచి కాంగ్రెస్ పార్టీలో బుధవారం చేరారు. కాగా, వారికి కాంగ్రెస్ నాయకులు మనోజ్‌రెడ్డి, భిక్షపతి, ఎల్లయ్య కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నూకల ఐలయ్య, సిహెచ్ కృష్ణమూర్తి, పి సదయ్యగౌడ్, ఎండీ ముక్తార్‌అలీ, సత్యనారాయణరెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మౌలాలి రైల్వేస్టేషన్‌లో కొత్తపల్లి వాసి మృతి

- నాలుగురోజుల అనంతరం వెలుగులోకి



శ్రీనివాస్(ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన రైల్వే ఉద్యోగి బోయినిపల్లి శ్రీనివాస్(42) మౌలాలి రైల్వేస్టేషన్‌లో ప్రమాదవశాత్తు రైలు నుంచి పడి మృతిచెందగా నాలుగు రోజుల అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందిన సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. మృతుడి బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తపల్లికి చెందిన శ్రీనివాస్ సికింద్రాబాద్‌లో రైల్వే ట్రాలీమన్‌గా పనిచేస్తున్నాడు. భార్య లావణ్య, కుమారుడు, కుమార్తె ఉండగా భార్య పిల్లలతో సికింద్రాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. కాగా, కొత్తపల్లిలో ఉన్న తల్లిదండ్రులను చూసేందుకు నాలుగురోజుల క్రితం మౌలాలి రైల్వేస్టేషన్‌లో రైలు ఎక్కే క్రమంలో ప్రమాదవశాత్తు జారి రైలు కింద పడి మృతిచెందాడు. రైల్వేపోలీసులు గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేసి అతడి మృతదేహాన్ని హైదరాబాద్ గాంధీ ఆస్పత్రి మార్చురిలో భద్రపరిచారు. అయితే ఈ విషయం భార్య, పిల్లలకు ఎవ్వరికీ తెలియదు. ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి నుంచి ఎలాంటి సమాచారం లేక పోవడంతో ఆచూకి కోసం వెతుకగా లభించలేదు. దీంతో మల్కాజ్‌గిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారించగా మౌలాలి రైల్వేస్టేషన్‌లో రైలుకింద పడి మృతిచెందాడని గుర్తించారు. మృతిచెందిన నాలుగు రోజుల అనంతరం భార్య, పిల్లలకు సమాచారం అందింది. ఈ ఘటనతో కొత్తపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రైలుకింద పడి గుర్తు తెలియని వ్యక్తి..

జనగామ రూరల్: రైలుకింద పడి గుర్తుతెలియని వ్యక్తి (50) ఆత్మహత్య చేసుకొని మృతి చెందిన ఘటన బుధవారం జనగామ రైల్వేస్టేషన్ 1వ ప్లాట్‌ఫామ్ పట్టాలపై చోటు చేసుకుంది. జీఆర్‌పీ ఆర్ రమణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం గుర్తు తెలియని వ్యక్తి తల, మొండెం వేరుగా పట్టాలపై పడి ఉందన్నారు. ఎరుపు రంగు జుట్టు, తెలుపు రంగు షర్ట్, నలుపు రంగు పాయింట్, బ్రౌన్ కలర్ చెప్పులు ధరించి ఉన్నాడన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు పోలీస్ సిబ్బంది 8712658603 నంబర్, జీఆర్‌పీ 9440027342 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



తరిగొప్పుల: మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న కనక దుర్గ మాత ఆలయ నిర్మాణానికి తమవంతుగా తరిగొప్పుల ఏకలవ్య సంఘం సభ్యులు రూ.20,116 విరాళాన్ని కమిటీ బాధ్యులు ఎంపీటీసీ అర్జుల మధుసూధన్‌రెడ్డికి బుధవారం అందజేశారు. సుల్తాన్ యాదగిరి, సిద్దిని మహిపాల్, సిద్దిని సుధాకర్, బూస యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

జప యజ్ఞంలో మండల వాసులు
బచ్చన్నపేట: మండలంలోని కేసిరెడ్డిపల్లి, బండనాగారం గ్రామాలకు చెందిన భక్తులు శతకోటి హరే రామ నామ జపయజ్ఞంలో బుధవారం పాల్గొన్నారు. గ్రామాల నుంచి భక్తులు భజనలు, కీర్తనలు చేసుకుంటూ సిద్దిపేట జిల్లా మరుకూక్‌లోని భావానందపురంలోని శ్రీపాండు రంగాశ్రమానికి చేరుకున్నారు. అక్కడ ఏకాదశి పర్వదినాన జరిగే హరేరామ శతకోటి జప యజ్ఞంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి
చిల్పూరు: బీజేపీ మండల నూతన కమిటీని పార్టీ మండల అధ్యక్షుడు గంటె ఉపేందర్ యాదవ్ బుధవారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీల బాధ్యులు గ్రామ, గ్రామాన పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కమిటీలను ప్రకటించారు. పార్టీ మండల ఉపాధ్యక్షులుగా బలంతుల కిషన్, పాలబోయిన జోగులు, సాదం బీమయ్య, సాదం వేణు. ప్రధాన కార్యదర్శులు ఎలిశాల శ్రీనివాస్, ముక్కెర శ్రవణ్, కార్యదర్శులుగా వలబోజు బ్రహ్మచారి, వద్దుల కుమార్, నేరెళ్ల సందీప్, దోరం శ్రీని వాస్, కోశాధికారిగా కాదుగాయ రమేష్, ఓబీసీ మోర్చ అధ్యక్షుడిగా ఊరడి రాజు, ప్రధాన కార్యదర్శిగా వేల్పుల సంపత్, దళిత మోర్చా అధ్యక్షుడిగా కందుకూరి రజనీకర్, బీజేవైఎం అధ్యక్షుడిగా తోట రంజిత్, ప్రధాన కార్యదర్శిగా నామాల రాహుల్, కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా పిట్టల రమేష్ ఎంపికయ్యారు.

నియామకం



జఫర్‌గఢ్: మండలంలోని తీగారం, తిమ్మంపేట గ్రామాలకు చెందిన తాటి సురేష్‌గౌడ్, అబ్బరబోయిన యాకస్వామిలను బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులుగా నియమించినట్లు స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గంటె ఉపేందర్‌యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత కొంత కాలంగా బీసీ సంక్షేమ సంఘం బలోపేతానికి సురేష్‌గౌడ్, యాకస్వామి చేస్తు న్న కృషిని గుర్తించి నియమించినట్లు పేర్కొన్నారు.

అప్పిరెడ్డిపల్లెకు ఖ్యాతి తెచ్చిన సమ్మయ్య



సమ్మయ్యను సన్మానిస్తున్న అధికారులు

దేవరుప్పుల: ప్రముఖ చిందు యక్షగాన కళాకారుడు గడ్డం సమ్మయ్యకు ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మశ్రీ పురస్కారంతో అప్పిరెడ్డిపల్లె ఖ్యాతి గడించిందని తహసీలార్ హుస్సేన్ అన్నారు. బుధవారం మండల కార్యాలయంలో అన్ని శాఖల అధికారుల ఆధ్వర్యంలో సమ్మయ్యను ఘనంగా సన్మానించి ప్రశంసించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, ఎస్సై చెన్నకేశవులు, ఎంపీఓ సురేష్‌కుమార్, నాయబ్ తహసీల్దార్ నవీన్‌కుమార్, ఐకేపీ ఏపీఓ వెంకట్‌రెడ్డి, ఆర్‌ఐ ఆంధ్రయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఆలయం ముస్తాబు



తిరుమలనాథస్వామి దేవాలయం



స్వామివారి మూలవిరాట్, ఉత్సవ విగ్రహాలు

స్టేషన్‌ఘన్‌పూర్: స్థానిక బస్టాండ్‌కు సమీపాన ఉన్న పురాతన తిరుమలనాథస్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాల్లో భాగంగా దేవాలయాన్ని ముస్తాబు చేశారు. ఈ నెల 16 నుంచి 26వ తేదీ వరకు నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతీ రోజూ విశేష పూజలను నిర్వహిస్తున్నారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని దేవస్థాన అభివృద్ధి కమిటీ బాధ్యులు, అర్చకులు, భక్తుల ఆధ్వర్యంలో దేవస్థానాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఈనెల 26వ తేదీవరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు ఉండగా ప్రధాన ఘట్టమైన శ్రీతిరుమలనాథ స్వామి కల్యాణ మహోత్సవం 23న(శనివారం) నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు కలకోట రామానుజచార్యులు తెలిపారు. భక్తుల సహకారంతో ఈ బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నామని, స్వామివారి కల్యాణానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపను పొందాలని ఆలయ అభివృద్ధి కమిటీ బాధ్యులు కోరుతున్నారు.

ఎంతో పవిత్రం



స్వామివారి బ్రహ్మోత్సవ పూజలు ఎంతో పవిత్రమైనవి, ఈ పూజలు చేపట్టడం ద్వారా సకల కష్టాలు తొలగుతాయి. సాక్షాత్తు తిరుమలనాథస్వామి శ్రీదేవి, భూదేవి సమేతంగా ఇక్కడ కొలువై ఉన్నారు. దాతలు, భక్తుల సహకారంతో ఉత్సవాలు నిర్వహిస్తున్నాం. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపను పొందాలి.

– రామానుజాచార్యులు, ఆలయ అర్చకుడు

ఠాణూ నాయక్ చరిత్రను పాఠ్యాంశంలో చేర్చాలి



దేవరుప్పుల: ఠాణూనాయక్ స్థూపానికి నివాళులర్పిస్తున్న నాయకులు

దేవరుప్పుల: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అసువులుబాసిన గిరిజన ముద్దుబిడ్డ జాటోత్ ఠాణూ నాయక్ వర్ధంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తూ.. ఆయన జీవత చరిత్రను భావితరాలకు తెలియజేసేలా పాఠ్యాంశాల్లో చేర్చాలని సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు అంగోత్ రాంబాబు నాయక్ డిమాండ్ చేశారు. ఠాణూ నాయక్ వర్ధంతి పురస్కరించుకొని ధర్మాపురంలోని ఆయన స్మారక స్థూపానికి బుధవారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రాంబాబు నాయక్ మాట్లాడుతూ ఠాణూ నాయక్ స్మృతి చిహ్నంగా హైదరాబాద్ ట్యాంక్ బండ్‌పై ఆయన విగ్రహం ఏర్పాటు చేయాలన్నారు. దేశవ్యాప్తంగా గిరిజన రిజర్వేషన్లు 12 శాతానికి పెంచాలన్నారు. గిరిజన తెగల భాషలను రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్‌లో చేర్చకుండా తెలంగాణలో పెంచిన 10 శాతం గిరిజన రిజర్వేషన్ జీఓ 33ను 9వ షెడ్యూల్ చేస్తామని హామీ ఇచ్చి అమలు చేయకుండా గత ప్రభుత్వం మోసం చేసిందన్నారు. వేలాదిమంది గిరిజన యువతకు ఉపాధి కల్పించే బయ్యారంలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయలేమని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ప్రకటించడం అవకాశ వాదానికి నిదర్శనం అన్నారు. జిల్లా అధ్యక్షుడు ధరావత్ శంకర్ నాయక్, ఉపాధ్యక్షులు పరశురాం నాయక్, సికిందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ రఘురాం, సేవాఘడ్ పీఠాధిపతి రమేష్ మహరాజ్, ఎస్పీ నాయక్, ప్రొఫెసర్ రాజారాం, కుటుంబ సభ్యులు జాటోత్ బాపూజీ, రామ్, చందర్, ఆనంద్, అజ్మీరా హర్యి, సేవాలాల్ సేన జిల్లా ఉపాధ్యక్షుడు బానోత్ మహేందర్, భూక్య రాజు విద్యార్థి సేన జిల్లా కార్యదర్శి లావుడియా అనిల్ చౌహన్, ధరావత్ రమేష్ నాయక్, దేవరుప్పుల మండల అధ్యక్షుడు కునుసోతు భీకు,గుగులోత్ శ్రీనివాస్‌పాల్గొన్నారు.

కొడకండ్ల: తెలంగాణ సాయుధ పోరాటంలో తుపాకి గుండ్లకు ఎదురొడ్డి ప్రాణత్యాగం చేసిన పోరాట యోధుడు జాటోత్ ఠాణూ నాయక్ అని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేష్‌నాయక్ అన్నారు. బుధవారం ఠాను నాయక్ వర్ధంతిని పురస్కరించుకొని గిర్నితండా వద్ద ఆయన విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించి ఠానునాయక్ పోరాట స్ఫూర్తిని కొనియాడారు. సుధీర్, కాల్‌రామ్, హేమాని, దేవ్ సింగ్, భాస్కర్, రవి, చందర్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కాంగ్రెస్ సేవాదల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సోమనారాయణ



వడ్డెగూడేనికి చెందిన డాక్టర్ మామిడాల సోమనారాయణను కాంగ్రెస్ సేవాదల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు పి.ప్రభాకర్‌రెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. గత కొంతకాలంగా సోమనారాయణ కాంగ్రెస్ సేవాదల్‌లో వివిధ హోదాల్లో పని చేశారన్నారు. సేవదల్‌తో పాటు పార్టీ బలోపేతానికి కృషి చేసిన ఆయన సేవలను గుర్తించి నియమించినట్లు ఆయన తెలిపారు.

కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడిగా చంద్రయ్య
మండలంలోని తమ్మడపల్లి (జి) గ్రామానికి చెందిన రాపర్తి చంద్రయ్య కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు నూకల ఐలయ్య బుధవారం తెలిపారు. చంద్రయ్య పార్టీ కోసం చేస్తున్న సేవలను గుర్తించి గ్రామ అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

అందరి సహకారంతో ఆలయ అభివృద్ధి
చిల్పూరు: కాకతీయుల కాలంలో నిర్మించిన సీతారామచంద్రస్వామి ఆలయాన్ని భక్తులు, దాతలు, ప్రజల సహకారంతో శ్రీరామనవమి నాటికి భక్తులకు సౌకర్యంగా ఉండేలా అభివృద్ధి చేస్తామని ఆలయ చైర్మన్ కోరుకొప్పుల హరికిషన్ అన్నారు. మండలంలోని నష్కల్ గ్రామంలోని ఆలయ ఉత్తర భాగం లోతుగా ఉండడంతో భక్తుల సౌకర్యార్థం బుధవారం ఎంపీటీసీ పాశం శిరీషసురేష్‌తో కలిసి మొరం నింపే పనులను చేపట్టామన్నారు.

హర్షం
దేవరుప్పుల: మూడు దశాబ్దాలుగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా దళితులకు దక్కని అవకాశాన్ని ప్రస్తుత నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి మండల అధ్యక్షుడిగా నల్ల శ్రీరాములును ఎంపిక చేయడంపై ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు, దేవస్థాన డైరెక్టర్ నాగరాజు హర్షం వ్యక్తం చేశారు.

సమస్యలు పరిష్కరించాలి
జనగామ రూరల్: క్షేత్ర స్థాయిలో పని చేస్తూ అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న బంజారా ఉద్యోగుల సమస్యలు పరిష్కారించాలని పట్టణ వార్డు కౌన్సిలర్ వాంకుడోత్ అనిత, టీబీఎస్ ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడు దస్రు నాయక్ అన్నారు. బుధవారం సంఘం క్యాలెండర్‌ను నాయకులు ఆవిష్కరించారు. స్వామి నాయక్, మల్లేష్, లాల్మా నాయక్, బికోజీ పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు ఫ్లాగ్ మార్చ్
పాలకుర్తి టౌన్: రాబోయే పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా శాంతిభద్రతల పరిరక్షణకు సీఆర్‌పీఎఫ్ బలగాలు ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య అన్నారు. మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తా వరకు పోలీసులు ర్యాలీని బుధవారం నిర్వహించారు. ఎన్నికలకు ప్రజలు సహకరించాలని ఏసీపీ కోరారు. పాలకుర్తి సీఐ మహేందర్ రెడ్డి, ఎస్సైలు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ
రఘునాథపల్లి: మండలంలోని మంగలిబండతండా శివారు దుబ్బతండాలో బుధవారం జగదాంబ మాత సేవాలాల్ ఆలయ నిర్మాణానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ జెడ్పీటీసీ, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు మారుజోడు రాంబాబు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణానికి దుబ్బతండాకు చెందిన మూడ్ రవి తన భూమిని విరాళంగా ఇవ్వడంపై అభినందించారు. ప్రకాష్‌రెడ్డి, చుక్క కిషన్, యాకయ్య పాల్గొన్నారు.

'గ్రూపు రాజకీయాలతో ఇబ్బందుల్లో ప్రజలు'
దేవరుప్పుల: గత పాలకుల ఆగడాలను అంతమొందించే దిశలో కాంగ్రెస్‌కు అనుకూలంగా ప్రజాతీర్పు ఇస్తే ఆచరణాత్మకంగా సరైన పాలన చేయలేక గ్రూపు రాజకీయాలతో ప్రజల్ని ఇబ్బందులకు గురిచేయడం విచారకరమమని బీజేపీ రాష్ట్ర నాయకుడు లేగ రాంమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన ఫోన్‌లో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కుమ్ములాటలను రోడ్డెక్కించి సామాన్యులకు ఇబ్బందులకు గురిచేయడం ఆ పార్టీ క్రమశిక్షణ రాహిత్యానికి అద్దం పడుతుందన్నారు. ప్రజలు ఎర్రబెల్లిని ఓడించి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డికి పట్టం గడితే మరో రూపంలో ఇబ్బందులకు గురి చేసే ప్రయత్నంలా కనిపిస్తుందని ఆరోపించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత
బచ్చన్నపేట: కొన్నె రహదారిలో నక్కవానిగూడెం ఎల్లమ్మ గుడి వద్ద 6 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ఎస్సై కంకల సతీష్ తెలిపిన వివరాల ప్రకారం..జగదేవపూర్ మండలం వల్లిపల్లి గ్రామానికి చెందమిన గుగులోత్ శంకర్ టాటా సుమోలో పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తీసుకెళ్తుండగా వాహనాలు తనిఖీ చేస్తుండగా సుమోలో 6 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నామని చెప్పారు. సుమో, బియ్యాన్ని స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.